క్లుప్తంగా

అనధికారిక పైపుల తొలగింపు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా సాగునీటి కాలువను కప్పేస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు అధికారులు శుక్రవారం పొక్లెయిన్‌తో తొలగింపు పనులు చేపట్టారు. మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నూతనంగా నిర్మిస్తున్న లే–అవుట్‌లో భాగంగా సాగునీటి కాలువను కప్పేశారంటూ స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పోలీసుల సమక్షంలో ఎటువంటి వివాదం జరగకుండా అధికారులు పైపులను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్లకు సంబంధించిన పనులు చేపట్టే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.
ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం, సర్వసిద్ధి, వాకపాడు, కర్రివానిపాలెం గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ఫీడర్ మెయింటెనెన్స్ పనులు చేపట్టనుండడంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నీ

ఎస్.రాయవరం: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పెగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించనున్నట్టు పీఆర్‌టీయూ మండల శాఖ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాలీబాల్ పోటీలతో పాటు బాలికలకు ముగ్గుల పోటీలు కూడా నిర్వహించనున్నామన్నారు.

తాగునీటి కుళాయి ప్రారంభం


కుళాయి ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక మెయిన్ రోడ్డులో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిని శుక్రవారం సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛత హీ–సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులతో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రామచంద్రరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు


గణపర్తిలో మేలుకొలుపులో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మేలుకొలుపులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ధనుర్మాసంలో భాగంగా గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు భజనలు చేస్తూ దేవతామూర్తులను నిద్రలేపుతూ పూజలు నిర్వహిస్తున్నారు. భోగి పండుగ రోజున మేలుకొలుపుల కార్యక్రమాన్ని ముగించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. అదే రోజున పలు గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం గణపర్తిలో మేలుకొలుపు ఘనంగా జరిగింది.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్


పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది

రాంబిల్లి(యలమంచిలి): పేకాట ఆడుతున్న నలుగురి అరెస్ట్ చేసినట్లు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు గ్రామం సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచదార్లలో గ్రావెల్ దందా

- కూటమి నేతల కనుసన్నల్లో గుట్టుగా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు



పంచదార్ల కొండ వద్ద గ్రావెల్ తరలించడానికి ఉన్న ట్రాక్టర్లు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం పంచదార్ల పంచాయతీ పరిధిలో గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ఫణిగిర కొండ దగ్గర పొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్లు, లారీలతో గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్న అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికార కూటమి నేతల అండదండలతో కొందరు గ్రావెల్ మాఫియా యథేచ్ఛగా ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పంచదార్ల శివారు భోగాపురం సమీపంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూపంపిణీలో భాగంగా పేదలకు ఉచితంగా డీపట్టాల రూపంలో భూములు ఇచ్చారు. అయితే ఆ భూములను ఇప్పటికీ లబ్ధిదారులకు అప్పగించలేదు. ప్రస్తుతం ఆ భూములపై గ్రావెల్ మాఫియా కన్ను పడింది. ఎటువంటి అనుమతులు లేకుండా కొండలను సైతం పిండి చేసేస్తున్నారు. రేయింబవళ్లు పొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్లతో గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. మరోవైపు గ్రామం మధ్యలోంచి ఈ గ్రావెల్ ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే ఎంతో పురాతనమైన ఫణిగిరి పర్వతం వద్ద ఉన్న చారిత్రక పుణ్యక్షేత్రం సమీపంలో ఇలా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో పుణ్యధారలు అంతరించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఈ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న అటు పురావస్తు శాఖ అధికారులు, ఇటు దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు ఇటీవల తహసీల్దారుకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో వీధి రోడ్లు వేయడానికి గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. అనధికారిక తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



పంచదార్ల, భోగాపురం గ్రామాలను అనుకొని ఉన్న ఫణిగిరి కొండపై ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కొందరు వ్యక్తులు గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా ట్రాక్టర్లు, లారీలతో గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. విలువైన గనులు తరలిపోతున్నా అధికార యంత్రాంగం గ్రావెల్ మాఫియాకు సహకరించడం చాలా అన్యాయం. ఇక్కడ జరుగుతున్న తంతుపై సోషల్ మీడియాలో వీడియోలు పెట్టినా గ్రావెల్ దందాపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.
– ధూళి సత్యయాదవ్, భోగాపురం గ్రామం

మితిమీరిన వేగంతో వెళ్తున్న ట్రాక్టర్లు



పంచదార్ల, భోగాపురం గ్రామాల మధ్యలో నిత్యం జనసంచారం, ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు నడుస్తున్న రోడ్డులో మితిమీరిన వేగంతో గ్రావెల్ లారీలు, ట్రాక్టర్లు వెళ్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. గ్రావెల్ తరలింపునకు అడ్డుఅదుపూ లేకుండా పోయింది. అధికారులు స్పందించి గ్రావెల్ తరలింపుపై చర్యలు తీసుకోవాలి.
– ధూళి ధర్మరాజు, భోగాపురం

రోడ్ల కోసమని చెబుతున్నారు..

పంచదార్ల పంచాయతీలో వీధి రోడ్లు వేయడానికి ఆ గ్రామం నుంచి కొందరు వ్యక్తులు అనుమతులు తీసుకున్నట్టు మాకు చెప్పారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.
– రవికుమార్, ఆర్ఐ, రాంబిల్లి మండలం

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న విశ్రాంత ఎంఈవో తమ్మిరాజు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విశ్రాంత ఎంఈవో తమ్మిరాజు సూచించారు. తిమ్మరాజుపేటలోని అంతర్జాతీయ డావెన్సీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డావెన్సీ ఉత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తన అలవాటు చేసుకోవాలన్నారు. స్కూల్ ఎండీ కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, హెచ్ఎం మిశ్ర, వైద్యులు రామమూర్తి, యశ్వంత్ కుమార్, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, కేవీ రమణ, కేఎస్‌వీ సత్యనారాయణ, అప్పారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగితలో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



ఆర్‌వో ప్లాంటు ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి: మండలంలో కాగితలో హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం కంపెనీ ప్రతినిధులు కుళ్లాయి రెడ్డి, సుబ్బారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజారెడ్డి ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షలతో ఇక్కడ గ్రామస్తుల కోసం మినరల్ వాటర్ ప్లాంటను ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ నిధులతో నక్కపల్లిలో ఉన్న పాఠశాలలతో పాటు, సుమారు 8 గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.రాజేష్, స్థానిక నాయకులు దేవవరపు శివ, సీఎస్ఆర్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

పాటిపల్లిలో ఘనంగా గిరి ప్రదక్షిణ


పాటిపల్లిలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో అహోబిల లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో గిరి ప్రదక్షిణను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ ప్రారంభించారు. ముందుగా లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవింద నామస్మరణతో పాటిపల్లి మార్మోగింది. ఈ ప్రదక్షిణ పాటిపల్లి బీసీ కాలనీ, గవర్ల అనకాపల్లి, తోటాడ, సిరసపల్లి, నారాయుడుపాలెం మీదుగా ఆలయానికి చేరుకుంది. డప్పు వాయిద్యాల నడుమ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

సర్వపాప హరణం.. ఉత్తర ద్వార దర్శనం

- భక్తులతో పోటెత్తిన ఉపమాక
- ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తజనం
- ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు


పొన్న వాహనంపై రుక్మిణి సహిత వేణుగోపాలస్వామి


ఎస్.రాయవరం వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు


రాజాధి రాజ వాహనంపై గోదాదేవి అమ్మవారు


రంగనాథుని అలంకరణ పుణ్యకోటి వాహనంపై వెంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

నక్కపల్లి: వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) సందర్భంగా శుక్రవారం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. గరుడాద్రిపై వెలసిన స్వామి వారిని ముక్తిమార్గం(వైకుంఠ ద్వారం) ద్వారా దర్శించుకుని భక్తకోటి తరించింది. తెల్లవారు జామున 3 గంటలకు గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్‌కు ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో తొలి అభిషేకం నిర్వహించారు. అర్చన నిత్య పూజా కార్యక్రమాలు, బాలబోగ నివేదన, పుణ్యాహవచనం, సాత్‌ముర్రై వంటి కార్యక్రమాల అనంతరం సామాన్య భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఏడాదికొకమారు ముక్కోటి ఏకాదశి పర్వదినాన స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలో అన్నవరం, సింహాచలం, భద్రాచలం తదితర ప్రముఖ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశినాడే వైకుంఠ ద్వార దర్శనం ఉంటుంది. ఉపమాకలో మాత్రం నిత్యం ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఆరో శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో తిరుపతి మాదిరిగానే ఇక్కడ కూడా పూజలు జరుగుతుంటాయి. తెల్లవారు జామున 3 గంటల నుంచే మెట్ల మార్గం ద్వారా గరుడాద్రి పర్వతంపై వెలసిన మూలవిరాట్ సన్నిధికి చేరుకున్నారు. ఈ ఏడాది బేడా మండపం దక్షిణ దిశగా ఉన్న శ్రీవారి పోటు వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి ఉత్తర దిక్కుగా స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. దీంతో భక్తులు గర్భాలయంలో ఉన్న వేణుగోపాల స్వామిని దర్శించుకుని బయటకు వచ్చి వేంకటేశ్వర స్వామివారిని ఉత్తర ముఖంగా దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్య కలగకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన రాజగోపురం ఎదురుగా ఉన్న అఖిలాండం నుంచే ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో బేడామండపం, కల్యాణ మంపాల చుట్టూ షామియానాలు, పెంటార్లు ఏర్పాటు చేయడంతో ఎటువంటి ఇబ్బందులు పడకుండా భక్తులు క్యూలైన్లో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. చినదొడ్డిగల్లు, కాగిత గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు వేంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని పల్లకిలో ఊరేగిస్తూ నగర సంకీర్తనలు పాడుతూ కాలినడకన ఉపమాక చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. నెల రోజుల పాటు ఆయా గ్రామాల్లో నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముక్కోటి ఏకాదశినాడు వారంతా సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన ఉపమాక వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్.రాయవరం: దార్లపూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి, ఎస్.రాయవరం వైభవ వేంకటేశ్వర స్వామి, కొరుప్రోలు సీతారామస్వామి ఆలయాల్లో భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం వైభవ వేంకటేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, పార్టీ నాయకుడు పాలుమూరి అప్పలరాజు, తదితరులు ఉత్తర ద్వారంలో దర్శించుకుని పూజలు చేశారు.

పాయకరావుపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానం, రాజుగారిబీడులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీసీతారామస్వామి దేవస్థానం, మంగవరం, పాల్తేరు, రాజగోపాలపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీలు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగవరం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

మునగపాక: గోవింద నామస్మరణతో మండలంలో పలు రామాలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నాగులాపల్లి, వాడ్రాపల్లి గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఇక్కడ ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. పాటిపల్లిలోని అహోబిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మునగపాకకు చెందిన అన్నమయ్య స్వరతరంగిణి కళాకారులు, అనకాపల్లికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కోలాటం, సంకీర్తనలు అలరించాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.


తిరువీధి సేవల్లో పాల్గొన్న భక్తులు


చినదొడ్డిగల్లు నుంచి కాలినడకన నగర సంకీర్తన పాడుతూ ఉపమాక వస్తున్న భక్తులు


పాటిపల్లిలో అన్నమయ్య సంకీర్తనలు


పాటిపల్లి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనకు హాజరైన భక్తులు


గరుడాద్రిపై స్వామివారికి తొలి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు


దార్లపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుంటున్న భక్తులు


పాండురంగ ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


మంగవరం ఆలయంలో భజన చేస్తున్న భక్తులు


నాగులాపల్లిలో వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పండగకెళ్తే.. ఇళ్లలో ఆభరణాలు ఉంచొద్దు

కశింకోట: సంక్రాంతికి ఇళ్లు విడిచి స్వగ్రామాలకు వెళ్లేవారు తమ విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లు, తదితర సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని సీఐ అల్లు స్వామి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీరువాల తాళాలను ఇళ్లలో ఉంచరాదని, వాటిని తమతోపాటు తీసుకెళ్లాలన్నారు. తమ ఇళ్ల సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తే, వాటిపై దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచుతామన్నారు.

వీడిన బాలిక కిడ్నాప్ కేసు

80 రోజుల తర్వాత ఇంటికి చేరిన బాలిక

నక్కపల్లి: మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో ఓ యువకుడిని నక్కపల్లి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సుమారు 80 రోజుల పాటు ముప్పుతిప్పలు పెట్టి, ఎట్టకేలకు నిందితుడు పోలీసులకు చిక్కాడు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు హోంమంత్రి దృష్టికి బాలిక కిడ్నాప్ వ్యవహారాన్ని ఆమె తండ్రి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, స్థానిక సీఐ పిన్నింటి రమణతో కలిసి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

మండలంలోని గంగవరానికి చెందిన మైనర్ బాలిక కనిపించట్లేదని తండ్రి నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది అక్టోబర్ 20న ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ రమణ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పతివాడ మహేష్(26) అనే యువకుడు బాలికను ద్విచక్రవాహనంపై తీసుకు వెళ్లినట్లు గుర్తించారు. దీనితో బాలిక అదృశ్యం కేసును నవంబర్ 11న కిడ్నాప్ కేసుగా నమోదు చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో బాలిక మండలంలోని అనకపల్లి జంక్షన్ వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న తండ్రి అక్కడికి చేరుకున్నాడు. బాధిత బాలికను తీసుకుని నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, కిడ్నాప్‌కు పాల్పడిన మహేష్‌ను, అందుకు సహకరించిన బాధితురాలి పిన్ని కొడుకు మాటూరి సాయి(25)పై ఫిర్యాదు చేశారు. నిందితుడు మహేష్ స్వగ్రామం విజయనగరం జిల్లా సాలిపేట. జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. బాలికను కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకెళ్లి, వివాహం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మైనర్ బాలిక కిడ్నాప్ కేసుతో పాటు పోక్సో చట్టం, ఇతర సెక్షన్లపై కేసు నమోదు చేశామన్నారు. వివాహం చేసుకుని మైనర్ బాలికతో సంసారం చేయడంతో బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. బాధితురాలి తండ్రి తన కుమార్తె కిడ్నాప్‌తో పాటు బంగారు నగలు, నగదు పట్టుకెళ్లినట్లు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ, వాటి విషయం తనకు తెలియదని నిందితుడు చెప్పాడు. దీంతో నిందితుడికి సహకరించిన బాధితురాలి బంధువు సాయి నగలు అపహరించి ఉంటాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.